టీయూలో ముగిసిన జాతీయ సదస్సు

డిచ్‌పల్లి, మార్చి6 : టీయూలో తెలుగు అధ్యయనశాఖ, ప్రాచీన తెలుగు అధ్యయనశాఖ, నెల్లూర్ భారతీయ భాషా సంస్థ మైసూర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు – లక్షల గ్రంథాల సమాలోచన' అంశంపై జాతీయ సదస్సు రెండో రోజు బుధవారం ముగిసింది. సభాధ్యక్షుడు ఆచార్య కనకయ్య ప్రసంగంతో సభ ప్రారంభమైంది. మానవీయ శాస్త్ర పీఠాధిపతి ఆచార్య కరిమిండ్ల లావణ్య.. 'శాస్త్ర కావ్యాలు – రాజనీతి శాస్త్రం' అంశంపై ప్రసంగించారు. రాజుకు ఉండాల్సిన లక్షణాలు కూడా కావ్యాల్లో ఎలా చెప్పబడ్డాయో వివరించారు. రాజు, రాజ్యాలు పోయినా రాజనీతి మాత్రం నిలిచి ఉంటుందన్నారు. శాస్త్ర కావ్యాలు, వేదాంతం, విశిష్ట ద్వైవం తదితర అంశాలపై తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షుడు లక్ష్మణ చక్రవర్తి ప్రసంగించారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా సత్యనారాయణ శాస్త్రి హాజరై ఆయుర్వేద శాస్త్రంలోని మౌలిక అంశాలపై వివరించారు. ఆత్మీయ అతిథి రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. తెలుగు శాస్త్ర కావ్యాలపై రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు పరిశోధకులకు ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య .సంపత్‌కుమార్, తెలుగు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

ఇందల్వాయి, మార్చి 6 : మండలంలోని కేకే తండా గ్రామపంచాయతీ పరిధిలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు ఎస్సై మనోజ్ బుధవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక డంప్‌లను గిర్దావర్ మోహన్‌కు బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు.

హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక

కంఠేశ్వర్, మార్చి 6 : రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధానకార్యదర్శి శ్యామలా పవన్‌కుమార్ ఆదేశాల మేరకు పెర్కిట్‌లో ఉన్న నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. 60 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రతిభ చూపినవారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఉమ్మడి జిల్లాల ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి వరంగల్‌లో నిర్వహించే 45వ రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే కంజర బాలుర గురుకుల పాఠశాల నుంచి ప్రణయ్, రుత్విక్, ప్రమోద్, శ్రీనివాస్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆర్సీవోతోపాటు ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, మార్చి 6 : జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అర్గుల్ గ్రామశివారులో శ్రీదేవి కోల్డ్ స్టోరేజీ పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిపేట్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన కానూరి గంగాధర్ అర్గుల్‌లోని తన బంధువుల ఇంటికి మంగళవారం రాత్రి 11 గంటలకు నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానూరి గంగాధర్ తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బులు రికవరీ చేయాలి

నిజామాబాద్ సొసైటీ మహాజన సభలో రైతుల డిమాండ్

సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న సహకార బ్యాంకు మేనేజర్ బాగారెడ్డి

సారంగాపూర్, మార్చి 6 : నిజామాబాద్ సొసైటీలో గత సీఈవో శివరామరాజు, క్లర్క్ భాస్కర్ కలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, వారి నుంచి వెంటనే డబ్బులను రికవరీ చేయాలని నిజామాబాద్ సొసైటీ పరిధిలోని రైతులు డిమాండ్ చేశారు. సొసైటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి అధ్యక్షతన విండో మహాజన సభను బుధవారం నిర్వహించారు. అవినీతికి పాల్పడిన వారి ఆస్తులను జప్తు చేసి, క్రిమినల్ కేసులు నమోదుచేసేందుకు సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. గతంలో సొసైటీ సీఈవోగా విధులు నిర్వర్తించిన శివరామరాజు రూ.51 లక్షల 46 వేలు, క్లర్క్ భాస్కర్ రూ.35 లక్షల 75 వేలు అవినీతికి పాల్పడినట్లు సహకార శాఖ ఆడిట్ అధికారుల ఆడిట్‌లో వెల్లడైందని రైతులు తెలిపారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళి స్పందిస్తూ.. అవినీతికి పాల్పడిన వారి నుంచి డబ్బులను తప్పకుండా రికవరీ చేస్తామని తెలిపారు. సహకార బ్యాంకు మేనేజర్ బాగారెడ్డి మాట్లాడుతూ.. రైతులు తమ డేటా వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. సొసైటీ సిబ్బంది లక్షల రూపాయల అవినీతికి పాల్పడుతుంటే పాలకవర్గ సభ్యులుగా ఏం చేస్తున్నారని రైతులు ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం ఏర్పడింది. సభలో ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్వర్‌గౌడ్, వైస్‌చైర్మన్ రవీందర్‌రెడ్డి, సొసైటీ సీఈవో విష్ణు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీవోబీ జీఎం రితేశ్‌కుమార్

సిరికొండ, మార్చి 6 : బ్యాంక్ ఆఫ్ బరోడా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జీఎం రితేశ్ కుమార్ అన్నారు. సిరికొండలో బీవోబీ బ్రాంచ్‌ను బుధవారం ప్రారంభించారు. ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలతో బ్యాంకును ఏర్పాటు చేశామని తెలిపారు. సిరికొండ బ్రాంచ్‌లో రూ.100 కోట్లకు పైగా టర్నోవర్ అవుతుండడం గొప్ప విషయమన్నారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో రీజినల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎస్‌డీ బీఎం సూర్యప్రసాద్, సిరికొండ మేనేజర్ జయప్రకాశ్, రాజశేఖర్, సల్ల రాజారెడ్డి, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి జీరో బిల్లుల అందజేత

జీరో బిల్లులను అందజేస్తున్న ఏఈ మిథున్, వైస్ ఎంపీపీ దశాగౌడ్

చందూర్, మార్చి 6 : మండలకేంద్రంలో పలువురికి గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లులను వైస్ ఎంపీపీ దశాగౌడ్ విద్యుత్ అధికారులతో కలిసి బుధవారం అందజేశారు. గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి కూడా జీరో బిల్లు రాకపోతే ప్రజాపాలన రసీదు, రేషన్ కార్డు, ఆధార్ కార్డును ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

కంఠేశ్వర్, మార్చి 6 : జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట నేడు (గురువారం) కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ పథకానికి సంబంధించిన పూర్తివివరాలను మార్చి 6, 2024 తేదీ నాటికి సమర్పించాలని ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు చెప్పినా, బీజేపీ విరాళాల వివరాలను సమర్పించకుండా మరింత సమయాన్ని కోరడాన్ని నిరసిస్తూ, బీజేపీ, ఎస్‌బీఐ మధ్య చీకటి ఒప్పందాన్ని ఎత్తిచూపేందుకు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కాంగ్రెస్ శ్రేణులు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్దకు తరలిరావాలని కోరారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో 'సైనిక్ స్కూల్' హాల్‌టిక్కెట్లు

■ 10న ప్రవేశపరీక్ష

డిచ్‌పల్లి, మార్చి 6 : కరీంనగర్ జిల్లాలోని రుక్మాపూర్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే పరీక్ష హాల్‌టిక్కెట్లు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో ఉంటాయని ప్రాంతీయ సమన్వయాధికారిణి అలివేలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. 6వ తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, మార్చి 6 : పీహెచ్‌సీల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి, మెరుగైన వైద్య సేవలందించాలని జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ మాట్లాడుతూ.. ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. రోగనిర్ధారణ రక్త పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు పీహెచ్‌సీలకు త్వరగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఆయుష్ శాఖ ప్రతినిధులు విస్తృతంగా సేవలందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సదుపాయాలు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. బాల్యవివాహాలను అరికట్టాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవోలు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీలు పాల్గొన్నారు.

టీయూలో కొనసాగుతున్న సమ్మె

డిచ్‌పల్లి, మార్చి 6 : టీయూలో పనిచేస్తున్న 276 మంది ఉద్యోగులు శ్రమదోపిడీకి వ్యతిరేకంగా టీయూ మెయిన్ క్యాంపస్‌లో చేపడుతున్న సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకున్నది. గతంలో టీయూ అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఆర్పీస్ –2020 ప్రకారం జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ నుంచి హామీ రానందున గురువారం కూడా సమ్మె కొనసాగుతుందని అవుట్ సోర్సింగ్ యూనియన్ సభ్యులు తెలిపారు.

పుస్తకాల అందజేత

సుభాష్‌నగర్, మార్చి 6 : నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న రామకృష్ణ విద్యానికేతన్‌లో వివేకానంద సాహిత్యానికి సంబంధించిన 95 పుస్తకాలను బాపూజీ వచనాలయ ప్రతినిధులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వచనాలయ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఈసీ సభ్యులు ఆరెట్టి లక్ష్మీనారాయణ, లక్కంరెడ్డి, యోగా రాంచంద్రం, ప్రిన్సిపాల్ శశిరేఖ, శ్రీనివాసాచారి, మధుసూదనాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తేనెతెట్టెలు

కలెక్టరేట్‌లోని గోడలకు ఉన్న తేనెతెట్టెలు

కంఠేశ్వర్, మార్చి 6 : నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఉద్యోగులు, ప్రజలకు తేనె టీగల భయం వెంటాడుతున్నది. కలెక్టరేట్‌లోని గోడలు, కిటికీలకు తేనెటీగలు తెట్టెలు పెట్టడం, గుంపులు గుంపులుగా తేనెటీగలు తిరుగుతుండడంతో అవి ఎటువైపు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. వివిధ పనుల మీద కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు సైతం అటువైపు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. పలువురు ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తేనెతెట్టెలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలోని పాఠశాల స్కూల్‌లో సైన్స్‌ఫేర్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

– ఖలీల్‌వాడి, మార్చి 6

'ధరణి' గడువు పొడిగించాలి

బోధన్, మార్చి 6: ధరణి పోర్టల్ ద్వారా రైతు సమస్యల పరిష్కారానికి ఈనెల 9వరకు విధించిన గడువును ఈనెలాఖరు వరకు పొడిగించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ..ధరణి ద్వారా చిన్న, సన్నకారు రైతులకు చెందిన పలు సమస్యలు పరిష్కారం కావాల్సి ఉన్నాయని అన్నారు. ధరణి ద్వారా అందిన కొన్ని పాస్‌పుస్తకాల్లో భూములు తక్కువగా నమోదు అయ్యాయని, కొంత మందికి పాస్‌పుస్తకాలే రాలేదని అన్నారు. దీంతో ప్రభుత్వ పరంగా అందే రైతు పెట్టుబడితో పాటు, ఇతర సంక్షేమ పథకాలు అందడం లేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు నడిపి నాగన్న, షేక్ నసీర్, మల్లేశ్, హనుమాండ్లు, సుదర్శన్, పోశెట్టి, రవి, వైద్యనాథ్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల అందజేత

పాఠశాలకు ఫ్యాన్లను అందజేస్తున్న దాతలు

కమ్మర్‌పల్లి, మార్చి 6: మండలంలోని చౌట్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌కు ఎస్ఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సూరబోయిన లలిత, ఎస్ఎంసీ మాజీ సభ్యులు సట్ట విజయ, చిలువేరి రాజేశ్వర్, సట్ట సత్యనారాయణ, గాయత్రి, రోజా, సత్యనారాయణ 12 ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆంద్రయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన ఫ్యాన్లు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో

ఆర్మూర్‌టౌన్, మార్చి6: ఆర్మూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం నూతన ఆర్డీవోగా రాజాగౌడ్ బాధ్యతలు స్వీకరించారు. బోధన్‌లో విధులు నిర్వహించిన ఆయన ఆర్మూర్‌కు బదిలీపై వచ్చారు. ఆయనను కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

హాస్టల్ విద్యార్థి మృతి ఘటనలో ఇద్దరిపై వేటు

శక్కనగర్, మార్చి 6: బోధన్ పట్టణంలోని బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థుల దాడిలో డిగ్రీ విద్యార్థి వెంకట్ మృతి చెందడంలో వార్డెన్ స్వామిని సస్పెండ్ చేయాడంతోపాటు వాచ్‌మన్ గంగాధర్‌ను విధుల నుంచి తొలగించినట్లు వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వెంకట్ సోదరుడు మల్కాన్‌కు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సంఘటన బీసీ వసతి గృహాలకు సంబంధించిందని, విద్యాశాఖతో సంబంధంలేదని ఆయన వెల్లడించారు. హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల సంపూర్ణ భద్రత కోసం బీసీ సంక్షేమ శాఖ అధికారులు అహర్నిశలు శ్రమించేలా చర్యలు చేపట్టుతున్నామని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ ధనవేని

ఆర్మూర్‌టౌన్, మార్చి6: పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాలపై బుధవారం సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. జాతీయస్థాయిలో సాఫ్ట్ బాల్ పోటీలో బంగారు పతకం సాధించిన అజ్మీరా ఇందును సన్మానించారు. అనంతరం క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డిని ప్రిన్సిపాల్ ధనవేని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో రవి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ఎడపల్లి, మార్చి6: మండలం కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితా యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.. బాల్య వివాహాలు చేస్తే కలిగే అనర్థాలను వివరించారు. యువతులకు 18, యువకులకు 21 ఏండ్లు నిండిన తర్వాత పెండ్లి చేయాలని అన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాల బాలికలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణ, తహసీల్దార్ దన్వాల్, సీడీపీవో జానకి, సూపర్‌వైజర్ విజయ రాణి, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

భయాందోళనకు గురిచేసిన మహిళ



మహిళను అదుపులో తీసుకున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్,మార్చి6: పట్టణంలోని హుస్నాబాద్ కాలనీలో ఓ గుర్తు తెలియని మహిళ ప్రజల ఇండ్లలోకి చొరబడి లోపలి నుంచి తలుపులు వేసుకొని స్థానిక ప్రజలను భయాందోళనకు గురి చేసింది. బుధవారం మధ్యాహ్నం సుమారు పది ఇండ్లలోకి చొరబడి లోపలి నుంచి తలుపులు వేసుకొని తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. దీంతో స్థానికులు పట్టుకొని ప్రశ్నించగా ఏమీ చెప్పక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సైలు అశోక్, అంజమ్మ గుర్తు తెలియని మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నందిపేట్, మార్చి 6: సిద్ధాపూర్‌లో బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్ రెడ్డి చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరైన రూ.5 లక్షలతో సీసీ రోడ్డు చేపడుగున్నట్లు తెలిపారు.

పరీక్ష అట్టల పంపిణీ

మోర్తాడ్, మార్చి6: తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలను బుధవారం పంపిణీ చేశారు. వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి గ్రామానికి, మండలానికి మంచిపేరుతీసుకురావాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సమ్మిరెడ్డి, పురుషోత్తం, శ్యామ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నీరజ్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

మాక్లూర్, మార్చి 6: మండలంలోని దుర్గానగర్ కింది తండాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వలంటీర్లు గ్రామంలోని పాఠశాల పరిసరాలు, గ్రామపంచాయతీ పరిధిలోని వీధులను బుధవారం శుభ్రపరిచారు. రక్తదానం ప్రాముఖ్యతను గ్రామంలోని యువతకు వివరించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. వేసవిలో నీటిని పొదుపు చేయాలని, మొక్కలను కాపాడాలని ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి డాక్టర్ ఎం.సంగీత పాఠశాలలోని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంగమాంబ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎన్ఎసెస్ వలంటీర్లు డి.సుమలత, శ్వేత పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న వలంటీర్లు, అధికారులు, అధ్యాపకులు

ప్రజాపాలన హెల్ప్ డెస్క్ ప్రారంభం

రెంజల్, మార్చి 6: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకం కింద అర్హులై లబ్ధిపొందని వారు కోడ్ నంబర్ ఆధారంగా సవరణ చేయనున్నట్లు తెలిపారు. 14 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో జీరో విద్యుత్ బిల్‌కు సంబంధించి ఎనిమిది మంది, వంట గ్యాస్ సబ్సిడీకి సంబంధించి ఆరుగురి వివరాలను సవరించినట్లు తెలిపారు. లబ్ధిపొందని వారు ఆందోళన చెందవద్దని, ప్రజాపాలన ప్రక్రియ నిరంతర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులను స్వీకరిస్తున్న మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్

సంక్షిప్తంగా..

- **పోడు పట్టాలకు క్రాప్ లోన్ అందించాలని వినతి -** చందూర్, మార్చి 6 : పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతులకు కూడా క్రాప్‌లోన్లు అందించాలని చందూర్ జడ్పీటీసీ సభ్యుడు అంబర్‌సింగ్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో అందజేస్తున్న విధంగా ఇక్కడి గిరిజనులకు కూడా లోన్లు అందించాలని గిరిజనులతో కలిసి కోరారు.
- **నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ -** ధర్పల్లి, మార్చి 6 : ధర్పల్లిలోని పాత గురడిరెడ్డి సంఘంలో ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురువారం పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి చెక్కులు పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.
- **నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి -** చందూర్, మార్చి 6 : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని వైస్ ఎంపీపీ దశాగౌడ్ అధికారులకు బుధవారం సూచించారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో బోరుమోటర్లు కాలిపోవడంతో, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సాయిలుతో పాటు సిబ్బందికి సూచించారు.
- **నర్సరీ పరిశీలన -** జక్రాన్‌పల్లి, మార్చి 6 : మండలంలోని కలిగోట్‌లో నర్సరీని ఎంపీడీవో సతీశ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జయంత్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.
- **నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు-** ఆర్మూర్‌టౌన్, మార్చి6: పట్టణంలోని నవనాథ్ సిద్దేశ్వర శివాలయంలో గురువారం నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకుడు కుమార్ బుధవారం తెలిపారు. గురువారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.
- **పేకాడితే చర్యలు తప్పవు-** నవీపేట,మార్చి 6: మండల కేంద్రంతోపాటువివిధ గ్రామాల్లో పేకాడేవారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం ఒక ప్రకనలో హెచ్చరించారు. కొన్ని గ్రామాల్లో పేకాట రాయుళ్లు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి పేకాట, జూదం ఆడుతున్నారని తమకు సమాచారం ఉందని పేర్కొన్నారు. పేకాట స్థావరాలపై దాడి చేసి నిందితులపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ సిబ్బందితో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.
- **మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి-** నందిపేట్, మార్చి 6: రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద పరిశుభ్రతపై దృష్టి సారించాలని, నిరంతర విద్యుత్ అందేలా చూడాలని కోరుతూ బుధవారం మండల ముస్లిం కమిటీ నాయకులు మండల అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు మహ్మద్ జావిద్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి రంజాన్ ప్రారంభం కానుందని తెలిపారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోకు, విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. బుధవారం తొండకూర్ మసీదులో కమిటీ మండల అధ్యక్షుడు మహ్మద్ జావేద్ అధ్యక్షతన మండల ముస్లిం కమిటీ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు.
- **పెద్దమ్మ తల్లి ఆలయంలో చోరీ-** ఎడపల్లి, మార్చి 6: మండలంలోని అంబం (వై) గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం చోరీ జరిగింది. ఎస్సై విక్రం కథనం ప్రకారం.. పూజారి మంగళవారం సాయంత్రం 6 గంటలకు పూజ ముగించికొని తాళాలు వేసి ఇంటికి చేరుకున్నాడు. బుధవారం ఉదయం 5 గంటలకు పూజ కోసం వెళ్లి చూడగా ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఆలయంలోని అమ్మవారి ముక్కు పుడక, పుస్తెల తాడు, వెండి కండ్లు పోయినట్లు గయనించి మాజీ సర్పంజ్ గంగాప్రసాద్‌కు సమాచారం అందించాడు. గంగాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.
- **ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన యువకుడికి సన్మానం–** మాక్లూర్, మార్చి 6: మండలంలోని గుంజలి గ్రామానికి చెందిన శాట శేఖర్ ఇటీవల ప్రభుత్వం మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, నాయకులు ఆయనను సన్మానించారు.
- **పేద విద్యార్థులకు ఫుడ్ ప్యాకెట్ల పంపిణీ -** రెంజల్, మార్చి 6: కందకుర్తి, నీలా, సాటాపూర్, వీరన్నగుట్ట ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు బుధవారం రంజాన్ పండుగ ఫుడ్ ప్యాకెట్లను ఫీడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. వెయ్యి మంది విద్యార్థుల కుటుంబాలకు సరుకుల ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు సూపర్‌వైజర్లు తెలిపారు.
- **వృద్ధుడి ఆత్మహత్య-** నవీపేట, మార్చి 6: బినోలా గ్రామానికి చెందిన అయిటి గంగారాం(60) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. గంగారాం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈనెల1న పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.